క్లుప్తంగా

పోటీ పరీక్షల మెటీరియల్ అందజేత



రుద్రూర్: మండల కేంద్రంలోని ప్రేరణ స్టడీ సెంటర్‌కు శుక్రవారం స్వచ్ఛంద సంస్థ గైస్ ఫర్ గుడ్ డీడ్స్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ చేసే మెటీరియల్‌ను ఆదివారం సంస్థ డైరెక్టర్ కొడే శంకర్ అందజేశారు. నిరుద్యోగులు, యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గతంలో నిరుద్యోగుల కోసం ఎంసెట్, బీఈడీ పరీక్షల పుస్తకాలు అందజేశారు. తెలంగాణ గ్రూప్ వన్ అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, ఇందూర్ విద్యా సంస్థల అధినేత కొడాలి కిశోర్ బాబు, పలువురు దాతలు స్టడీ సెంటర్‌కు అవసరమగు పుస్తకాలతో పాటు నిర్వహణకు సహకారాన్ని అందిస్తున్నారు. స్టడీ సెంటర్ నిర్వహణకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యూత్ సభ్యులు పత్తి నవీన్, అడ్ప రవి, బచ్చు పవన్, అడ్ప నవీన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సాయం

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గంగొల్ల గాండ్ల మోహన్ శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మోహన్ ఒంటరిగానే జీవిస్తున్నారు. దీంతో అంత్యక్రియలు గ్రామస్తులు దగ్గరుండి ఆదివారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ రూ.పది వేలు, గ్రామస్తులు రూ. 50 వేలు జమ చేసి అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. అందరితో కలుపుగోలుగా ఉండే మోహన్ ఆకస్మికంగా మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల బీజేపీలో చేరిన ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన దేవేందర్ రెడ్డి ఆదివారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో దేవేందర్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కండువాతో దేవేందర్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మోత్కూరి లింగా గౌడ్, నాయకులున్నారు.

మేరు సంఘం పట్టణ అధ్యక్షుడిగా రవినాథ్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణ మేరు సంఘం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రాజులదేవి రవినాథ్ ఎన్నికయ్యారు. పట్టణంలోని మేరు భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో 440 ఓట్లకు గాను 391 ఓట్లు పోల్ కాగా రవినాథ్‌కు 219, మరో అభ్యర్థి గోవర్ధన్‌కు 171 ఓట్లు వచ్చాయి. దీంతో రవినాథ్, సమీప ప్రత్యర్థిపై 48 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాగా రవినాథ్ వరుసగా రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పదవీ కాలం 2026 వరకు ఉంటుంది. నూతన అధ్యక్షుడ్ని మేరు సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ముదిరాజ్ సంఘ ప్రతినిధులు గుర్రపు శేఖర్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను అసభ్యపదజాలంతో దూషించినందుకు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. కౌశిక్‌రెడ్డి వెంటనే ముదిరాజ్‌లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సంఘ సభ్యులు శేఖర్, కిషన్, ప్రశాంత్, స్వామి, కిరణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వారం పూర్తయ్యేదెప్పుడో?

- ఏడాదిన్నర గడిచినా అసంపూర్తిగానే పనులు
- ఆరు నెలలుగా ముందుకు సాగని పనులు
- పోచంపాడ్‌లో కోదండ రామాలయం పరిస్థితి



శంకుస్థాపన చేసిన శిలాఫలకం



అసంపూర్తిగా ఉన్న ఉత్తర ద్వారం

బాల్కొండ : మెండోరా మండలం పోచంపాడ్‌లో పవిత్ర గోదావరి తీరాన ఉన్న కోదండ రామాలయం ఉత్తర ద్వారం పనులు పూర్తయ్యేదెప్పుడో అంటూ భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఏడాదిన్నర గడిచినా పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ఉత్తర ద్వారం నిర్మాణం కోసం ప్రభుత్వం దేవాదాయ శాఖ నుంచి రూ.24.5 లక్షల నిధులను మంజూరు చేసింది. దీంతో 2021 డిసెంబర్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ద్వారం నిర్మాణం పూర్తయింది. కాని ఆ ద్వారానికి సిమెంట్ ప్లాస్టరింగ్ పనులు మాత్రం చేపట్ట లేదు. ఆరు నెలల నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదని సంబంధిత అధికారులు సెలవిస్తున్నారు. కానీ పనులు చేపట్టే కాంట్రాక్టర్‌పై మాత్రం చర్యలు శూన్యం. రెండో భద్రాదిగా ప్రసిద్ధి చెందిన కోదండ రామాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను నిర్వహించటానికి ఉత్తర ద్వారం లేదు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశం ఉంటుంది. కాని ఇక్కడ గతంలో ఆ అవకాశం లేదు. దీంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేసింది. కాని పనులు నత్తనడక చేపట్టడం వల్ల గత జనవరి 2న నిర్వహించిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సిద్ధం కాలేదు. కనీసం శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని భక్తులు కోరారు. కాని అప్పటికి కూడ పూర్తి కాలేదు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయించాలని భక్తులు కోరుతున్నారు.

పనులు త్వరలోనే పూర్తి చేస్తాం

కోదండ రామాలయంలో ఉత్తర ముఖ ద్వారం పనులు త్వరలోనే పూర్తి చేస్తాం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను అ మధ్యనే ఆదేశించాం. పనులు ప్రారంభించి వేగవంతం చేసి పూర్తి చేస్తాం.

– సుప్రియ, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయశాఖ, నిజామాబాద్

కొనసాగుతున్న బీజేపీ ఇంటింటి ప్రచారం



రాణంపల్లిలో పథకాల గురించి ప్రచారం చేస్తున్న నాయకులు,



అడవి మామిడిపల్లిలో..

రుద్రూర్: రాణంపల్లిలో మహాజన్ సంపర్క్ అభియాన్.. కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర బీజేపీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ నేతలు మాట్లాడుతూ.. దేశాభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పలు పథకాలకు కేంద్రం నిధులు ఇస్తోందని వివరించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సుపరిపాలనకు బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, రుద్రూర్ మాజీ సర్పంచ్ తోట శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ పరిధిలో..

మాక్లూర్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం అడవి మామిడిపల్లి, గొట్టిముక్కల గ్రామాలలో బీజేపీ పథకాలను వివరిస్తూ మండల బీజేపీ నాయకులు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోదీ 9 సంవత్సరాల పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గంగోనే సంతోష్, ముప్పడి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికి బీజేపీ'కి విశేష స్పందన

– బీజేపీ నేత మేడపాటి ప్రకాష్ రెడ్డి



ప్రచారంలో మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి

బోధన్: బీజేపీ కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు నియోజకవర్గంలో చేపట్టిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పార్టీ బోధన్ నియోజకవర్గ నాయకుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్ ప్రాంతంలో పలు కాలనీల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు వడ్డీ మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు సుధాకర్ చారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెండర్ లేకుండా రూ.100 కోట్ల కాంట్రాక్టా!

- ఇచ్చే హక్కు ఎవరిచ్చారు
- ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి ప్రశ్న
- మంత్రి వేముల సవాల్‌కు సిద్ధం



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ/కమ్మర్‌పల్లి : టెండర్ లేకుండా రూ.వంద కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చే హక్కు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఎక్కడిదని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మోర్తాడ్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మంత్రి టెండర్ లేకుండా ప్రజాధనాన్ని ఒకే ఆస్థాన కాంట్రాక్టర్‌కు ఊడ్చి పెట్టాడని ఆరోపించారు. కమీషన్ల వ్యవహారంపై మంత్రి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మంత్రి నాసిరకంగా నిర్మించిన చెక్ డ్యాం, రోడ్లపై చర్చించటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. రూ.10 కోట్లు దాటిన టెండర్లు, కమిషనర్ ఆఫ్ టెండర్స్‌కు పంపాలన్నారు. కానీ బాల్కొండ నియోజకవర్గంలో ఇవన్నీ జరగవన్నారు. చెక్ డ్యాం, రోడ్లలో నాసిరకం పనులు చూపెట్టడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. మంత్రి తనతో కలిసి పరిశీలనకు రావాలని సవాల్ విసిరారు. నియోజక వర్గంలో చిన్న పిల్లాడిని అడిగినా ప్రతి పనిలో మంత్రికి కమీషన్ తీసుకుంటున్నారని చెబుతారన్నారు. నియోజక వర్గంలో గంజాయిని ప్రోత్సహించి యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి మాటున ప్రజాధనం దోపిడీ జరిగిందన్నారు. సునీల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ 73వ ఆవిర్భావ దినోత్సవం



బోధన్: ఆలిండియా స్టూడెంట్ బ్లాక్(ఏఐఎస్‌బీ) 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ ఎస్సీ బాలుర హాస్టల్ ఆవరణలో నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆలోచనా విధానంతో 1951 జూన్ 25న బెంగాల్ రాష్ట్రంలో తమ సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగం పట్ల పూర్తిగా నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. నాయకులు రాజన్న, సతీష్, శ్రీను, గంగా ప్రసాద్, మోహన్, దిలీప్, జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు'



ఎమర్జెన్సీ సమయంలో జైలు పాలైన ఆర్మూర్ నేతలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 1975, జూన్ 25న భారతదేశంలో ఎమెర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగా రెడ్డి ఆరోపించారు. పెర్కిట్‌లో ఆదివారం ఎమర్జెన్సీ సమయంలో జైలుపాలైన ఆర్మూర్‌కు చెందిన పుప్పాల రాజేందర్, చిలువేరి శ్రీధర్, భూసా గోవర్ధన్, తంబాకు శేఖర్, తంబాకు శంకర్‌లను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ ద్వారా మీడియాతో పాటు సుప్రీం కోర్టును సైతం తన గుప్పెట్లో పెట్టుకున్నారన్నారు. ఇప్పటికి కాంగ్రెస్ పార్టీ అదే సిద్ధాంతాన్ని అవలంబిస్తుందన్నారు. అలాగే తెలంగాణలో సైతం సీఎం కేసీఆర్ అప్రకటిత ఎమర్జెన్సీతో నిజం మాట్లాడిన వారిని, మీడియాను అరెస్టు చేసి జైలు పాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర నాయకుడు లోకభూపతి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దోళ్ల గంగారెడ్డి, బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, నాయకులు భాస్కర్,తదితరులున్నారు.

రుణమాఫీ లేక రైతులపై వడ్డీ భారం

- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి



దూపల్లిలో రైతులతో మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి

రెంజల్(బోధన్): ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ లభించక రైతులు చక్రవడ్డీలు కడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. దూపల్లిలో ఆదివారం స్థానిక కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక బ్యాంకు అధికారులు రైతులను వేధిస్తున్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. రైతులు దొంగలు కాదని, రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించడంతో ఆశతో సకాలంలో రుణాలను చెల్లించడం లేదన్నారు. బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లకు తిరుగుతూ వేధించడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టి నిధులను దుర్వినియోగం చేస్తుందన్నారు. పాఠశాలల్లో టీచర్లను నియమించడంలేదన్నారు. దీంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇప్పుడు ఇస్తున్న అన్ని రకాల పథకాలు నిలిచిపోతాయని ప్రచారం చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇస్తున్న పథకాలనే బీఆర్‌ఎస్ పెంచి కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మోబిన్‌ఖాన్, నాయకులు తాహెర్‌బిన్, అంతరెడ్డి రాజరెడ్డి, ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

గోసంగిలకు సంక్షేమ ఫలాలు అందించాలి



బోధన్: సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడి పేదరికంతో జీవనం కొనసాగిస్తున్న గోసంగిలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించి ఆదుకోవాలని గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం రాజేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నవీపేట మండల కేంద్రంలో నిర్వహించిన నవీపేట గ్రామ కమిటీ సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోసంగీ కులస్తులకు గౌరవ ప్రదమైన నామినేటెడ్ పదవి ఇవ్వాలని, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ఎకరం స్థలం, రూ. కోటి నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నిరుగొండ బుచ్చన్న, గోసంగీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రతినిధులు వెంకటరమణ, క్లెం గంగాధర్ కొండపల్లి గంగాధర్‌లు పాల్గొన్నారు.

సంఘ గ్రామ నూతన కమిటీ ఎన్నిక

గోసంగి సంఘం నవీపేట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఈర్నాల రాములు, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శిగా గంధం అశోక్, సహాయ కార్యదర్శిగా ఈర్నాల చిన్న సాయిలు, ప్రచార కార్యదర్శిగా ఈర్నాల సత్యనారాయణ, తదితరులను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



ముప్కాల్ మండల కేంద్రంలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ముందుగా పవిత్ర గోదావరికి కాలి నడకన వెళ్లి గంగనీళ్లను తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో డప్పువాయిద్యాల మధ్య వలగొడుగుతో ఊరేగించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో సోమవారం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహిస్తామని వీడీసీ సభ్యులు ఆదివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్మూర్ ప్రజా ఐక్య వేదిక సర్వ సమాజ్ ఆధ్వర్యంలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ ప్రజా ఐక్య వేదిక సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వ సమాజ్ సభ్యులు శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతం నుంచి తీసుకువచ్చిన గంగా జలాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. సర్వ సమాజ్ పెద్దలు జాగీర్దార్ శ్రీను, గోజూరు శ్రీను, కర్తన్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు వైద్యుడు లేక నిలిచిన ఆపరేషన్లు..!

- పట్టించుకోని ప్రభుత్వం
- బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో ప్రస్తుత పరిస్థితి



బాల్కొండ: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో మత్తు వైద్యుడు లేక పోవడంతో కాన్పుల ఆపరేషన్లు నిలిచిపోయాయి. దీంతో గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రికి లేదంటే ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో మూడేళ్ల నుంచి సాధారణ కాన్పులతో పాటు, సిజేరియన్లు కూడా చేస్తున్నారు. అప్పటి నుంచి కూడా ఆస్పత్రిలో మత్తు వైద్యుడు లేడు. కొన్నాళ్లు ప్రస్తుతం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోగా కొనసాగుతున్న డాక్టర్ రమేశ్ మత్తు వైద్యుడు కావడంతో సేవలందించారు. ప్రస్తుతం ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఏడాదిన్నరగా ప్రయివేటు వైద్యులను అద్దెపై తీసుకొచ్చి ఆపరేషన్లు చేపట్టారు. కాని ప్రస్తుతం మత్తు వైద్యుడికి ప్రభుత్వం చెల్లించాల్సిన అద్దె సకాలంలో చెల్లించకపోవడంతో ఎవరూ ముందుకు రావడం లేదు. మూడు వారాలుగా ఆస్పత్రిలో కాన్పుల ఆపరేషన్లను నిలిచిపోయాయి. పాలకులు ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. బాల్కొండ ప్రభుత్వాస్పత్రి పరిధిలో సుమారు 30 గ్రామాలు ఉన్నాయి. కిసాన్‌నగర్, పోచంపాడ్, మెండోరాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అంటే ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం స్పందించి వెంటనే పూర్తి స్థాయిలో మత్తు వైద్యుడిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే దూరాభారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల వైద్యుడిది అదే పరిస్థితి

ప్రభుత్వాస్పత్రిలో పిల్లల వైద్యుడు కూడా లేడు. దీంతో అప్పుడే పుట్టిన శివువును ఆర్మూర్‌లోని ప్రయివేటు ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. పేదవారికి వాహన సదుపాయం లేక ఆటోలలోనే శిశువును తీసుకెళ్లటానికి తిప్పలు పడుతున్నారు. ప్రస్తుత కాలంలో అప్పుడే పుట్టిన శిశువుకు పిల్లల వైద్యుడితో తప్పక పరీక్షలు చేయించాల్సి వస్తుంది. పిల్లల వైద్యుడిని కూడ వెంటనే నియమించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఆసుపత్రిలో మత్తు వైద్యుడి కొరత గురించి ఉన్నత అధికారులకు నివేదించాం. మత్తు వైద్యుడు లేక పోవడంతో కాన్పులు చేపట్టడం లేదు. సాధారణ కాన్పులు మాత్రమే చేపడుతున్నాం. ప్రయివేటు వైద్యులను తీసుకువచ్చినా అద్దె బిల్లులు రావడం లేదు. – డాక్టర్ అనిల్, వైద్యాధికారి, బాల్కొండ

ఘనంగా పోచమ్మ పండగ



మామిడిపల్లిలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వీడీసీ ఆధ్వర్యంలో పోచమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో వల గొడుగు, బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోచమ్మ దేవతను దర్శించుకుని వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో విలసిల్లాలని వేడుకున్నారు. కౌన్సిలర్లు ఆకుల రాము, రవి గౌడ్, కాశీరాం, వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు శాంతి కమిటీ సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): బక్రీద్ పండుగ పురస్కరించుకుని ఆర్మూర్ పుర ప్రముఖులతో సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు ఆదివారం తెలిపారు. పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి పుర ప్రముఖులు హాజరు కావాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా

బోధన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా కార్యక్రమం తలపెట్టామని ఆ సంఘం తాలూకా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, ఎం. రాజేశ్వర్‌రావులు ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ-తెలుగు) - 3.10 ది ఫ్లాష్ - 12.00, 6.55, 10.05
స్క్రీన్-2 –	ఆదిపురుష్ (3డీ-తెలుగు) - 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 –	ఆదిపురుష్ (2డీ-తెలుగు) - 10.30, 2.15, 6.00, 9.45
స్క్రీన్-4 –	ఆదిపురుష్ (2డీ-తెలుగు) - 11.00, 2.45, 6.30, 10.15